ప్రజాశక్తి
సోమవారం 22 జులై 2024 5 అనంతపురం





జలకళ సంతరించుకున్న తుంగభద్ర జలాశయం

నేడు హెచ్‌ఎల్‌సికి నీరు విడుదల

తుంగభద్ర డ్యామ్‌కు పోటెత్తుతున్న వరద
1.16 లక్షల క్యూసెక్కులకు చేరిన ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు సోమవారం నుంచి తుంగభద్ర డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఈనెల 16వ తేదీ నుంచి తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో 28 వేల క్యూసెక్కులు రావడం మొదలైంది. ఆదివారం నాటికి అవి 1.16 లక్షల క్యూసెక్కులకు చేరుకున్నాయి. దీంతో తుంగభద్ర డ్యామ్ నిండుకుండలా మారింది. పూర్తి నిలువ సామర్థ్యం 105 టిఎంసిలు అయితే ప్రస్తుతం నీటి నిలువ 74 టిఎంసిలకు చేరింది. వరద పోటు ఇదే విధంగా కొనసాగితే మరో రెండు రోజుల్లో పూర్తి సామర్థ్యంతో డ్యామ్ నిండనుంది. దీంతో అధికారులు ఇప్పటికే డ్యామ్ పరిధిలోని పంటకాలువలకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకున్నారు.

నేటి నుంచి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు

అనంతపురం జిల్లాకు సాగు,తాగునీటిని అందించే ప్రధాన కాలువ అయిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు సోమవారం నుంచి నీటిని విడుదల చేయాలని హెచ్‌ఎల్‌సి అధికారులు బోర్డును కోరారు. డ్యామ్‌కు నీరు కూడా పుష్కలంగా చేరుతుండటంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు విడుదల చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే కర్నాటక ప్రాంతంలోనూ ఇండెంట్ రావడంతో రెండూ కలిపి ఎగువ ప్రధాన కాలువకు నీరు విడుదల కానుంది. ఈ ఏడాది 26 టిఎంసిల వరకు నీటిని తీసుకునేందుకు వీలుందని ముందుగా అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు నీటిని జిల్లాకు తీసుకునేందుకు ఇక్కడి అధికారులు చర్యలు చేపట్టారు.

కాలువ పటిష్టతపైనే సందేహాలు ?

కర్నాటకలో సకాలంలో వర్షాలు రావడంతో డ్యామ్‌కు నీరొచ్చి అనుకున్న సమయానికి ఎగువ ప్రధాన కాలువకు నీరు తీసుకునే వెసులుబాటు లభించింది. అయితే ప్రధాన కాలువ పటిష్టతపైనే సందేహాలున్నాయి. ఎందుకంటే గడిచిన కొన్నేళ్లుగా ఈ కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తక్షణం మరమ్మతులు చేపట్టాల్సినవి ఉన్నాయి. అయితే నిధుల్లేక అధికారులు ఉన్న కాడికే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ నీరు జిల్లాకు తీసుకురావడం ఎంతో అవసరం. అయితే కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో పూర్తి స్థాయి సామర్థ్యంతో నీటిని తీసుకునే అవకాశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నాం

తుంగభద్ర డ్యామ్ నుంచి సోమవారం నుంచి నీటిని తీసుకునేందుకు ఇండెంట్ ఇచ్చాం. డ్యామ్‌లోనూ నీరు పుష్కలంగా ఉన్నందున నీటి విడుదల చేయనున్నారు. వచ్చే నీటిని జాగ్రత్తగా జిల్లాకు చేర్చేందుకు అవసరవమైన విధంగా చర్యలు చేపడుతున్నాం. కొన్ని చోట్ల గట్లు బలహీనంగా ఉన్న మాట వాస్తవమే. అయితే అప్రమత్తంగా ఉండి నీటిని తీసుకొచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

రాజశేఖర్
ఎస్ఇ, హెచ్‌ఎల్‌సి

- ‘ఉచిత ఇసుక’కు ఖర్చు ఎక్కువ
- అక్రమార్కులను ఆశ్రయిస్తున్న వినియోగదారులు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- నిఘా పెట్టని అధికార యంత్రాంగం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



పేట్రేగిన ఇసుకాసురులు

పట్టణంలోని ముదిరెడ్డిపల్లిలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఈ వ్యక్తి పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి, రోజుకు వందల లోడ్‌ల ఇసుకను పక్కన ఉన్న పెన్నా నదిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలించుకున్నారు. రూరల్ మండలం బేవినహల్లి వద్ద ఉన్న నదిలో నుంచి ఓ ప్రజా ప్రతినిధి సోదరుడిని తనయుడు పదుల సంఖ్యలో ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని పట్టణ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక ఉచితం పథకంలో రవాణా ఖర్చులు పేరుమీద విధిస్తున్న రుసుం ఎక్కువగా ఉండటంతో ఇసుక వినియోగదారులు అక్రమార్కులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకాసురులు అడ్డగోలుగా ఇసుకను తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామన్న హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చింది. జిల్లాలో 5 ప్రాంతాలలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఇసుకను అక్కడ స్టాక్ చేశారు. అయితే ఇసుక రవాణాపై విధించిన రుసుం ఎక్కువగా ఉండటంతో ఇసుక వినియోగదారులు ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇసుకాసురులు హిందూపురం పట్టణం పక్కన ఉన్న బేవినహళ్లి వద్ద, ముదిరెడ్డిపల్లి వద్ద పెన్నా నదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను యథేచ్ఛగా దోచేస్తున్నారు. ఇది తెలిసినప్పటికి అధికార యంత్రాగం ఏమీ పట్టనట్లు ఉంది.సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ఇసుక అక్రమ రవాణపై నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించినప్పటికి ఆ ఆదేశాలను తుంగలో తొక్కి, పరోక్షంగా అక్రమ ఇసుకాసురులకు సహరిస్తున్నారన్న ఆరోపణలు వినపిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా అవసరం ఉన్న వారికి ఉప్పలపాడు, కొడవండ్లపల్లి, నల్లబోయినపల్లి, కుటాగుళ్ళ, రామగిరి స్టాక్ యార్డుల నుండి ఇసుకను అందించే ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. ఇసుక నిల్వచేసిన డంపింగ్ యార్డ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించారు. 5 స్టాక్ పాయింట్లలో 35 వేల మెట్రిక్ టన్నుల నిల్వ చేసినట్లు అధికారులు చెప్పారు. అక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా ఇసుక అవరమైన వారికి అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఇసుక యార్డులకు ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తరలించి, తీసుకువచ్చేందుకు అయ్యే నిర్వాహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ, ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే నిర్వహణ ఖర్చు పేరుతో టన్ను ఇసుకకు రూ.605 ధర నిర్ణయించింది. దీంతో ‘ఉచిత ఇసుక’ తీసుకునేందుకు ప్రజలు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు ముందుకు రావడం లేదు. ఉచితం ఉత్తుత్తిదేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇసుక కేంద్రాలలో సరఫరా నత్తనడకన సాగుతుంది. ఇసుక ఉచిత పంపిణీ కేంద్రాల నుంచి ఇసుకను తరలించడానికి ట్రాక్టర్ ఇసుక రూ.3,400లు అవుతోంది. ప్రభుత్వ నిబంధల ప్రకారం టన్ను ఇసుకకు రూ.605 చెల్లించాలి. ట్రాక్టర్‌కు నాలుగు టన్నుల ఇసుక పడుతుందనుకుంటే, ట్రాక్టర్‌కు రూ.2420 చెల్లించాలి. ట్రాక్టర్ అద్దె మరో రూ.వెయ్యి చెల్లించాలి. దీంతో ట్రాక్టర్ అద్దె, ఇసుక కేంద్రంలో చెల్లించే సొమ్ముతో కలిపి రూ.3,400కు పైగా ఖర్చవుతోంది. అయితే హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్ లేనందున ఇక్కడి వారు ఇసుక కోసం పుట్టపర్తి, రాప్తాడు ప్రాంతాల్లో ఉన్న ఇసుక రీచ్‌లను ఆశ్రయించాల్సుంటుంది. దీంతో రవాణా ఖర్చు తడిసి మోపడవుతుంది. దీంతో ఇసుక కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిని ఆసరగా చేసుకుని ఇసుక అక్రమ రవాణాదారులు పట్టణానికి పక్కన ఉన్న పెన్నా నదిని తోడేస్తున్నారు. పెన్నా నదిలో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తే ట్రాక్టర్ రూ.3500 నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే ఉచిత ఇసుక కేంద్రం నుంచి ట్రాక్టర్ ఇసుకను హిందూపురం తీసుకు రావలంటే రూ. 5వేల వరకు ఖర్చవుతోంది. అక్రమంగా తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్ ఇసుక తీసుకుంటే రూ.15వందల నుంచి 2 వేల రూపాయల వరకు మిగలడంతో ప్రజలు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు వారి నుంచే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక కేంద్రాల నుంచి తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ ఇసుక కేంద్రాల వద్ద నుంచి హిందూపురం ప్రాంతానికి ఇసుక రావటం లేదు. అయితే ఇసుక అక్రమ రవాణాదారుల వ్యాపారం మాత్రం పట్టణంలో జోరుగా సాగుతుంది. నిఘా ఏర్పాటు చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఇక సెబ్ అధికారులు మాత్రం అడపా దడపా పట్టుకుని జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల సెబ్ అధికారులు బేవినహల్లి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని జరిమాన వేసి వదిలేశారు. సెబ్ పోలీసులు అడపాదడపా నామమాత్రపు దాడులు చేసి, అరకొర ట్రాక్టర్లను పట్టుకుని వదిలేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు.

నిఘా ఏర్పాటు చేసిన ఆగని అక్రమ రవాణ

జిల్లా వ్యాప్తంగా గట్టి నిఘా ఏర్పాటు చేసినా ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. దీని కోసం జిల్లా కలెక్టర్ ఇసుక సరఫరాపై ఫిర్యాదులు. సలహాల కోసం ఒక కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. అంతేకాక ఒక టోల్ ఫ్రీ నెంబరు 1800-425-6041ను ఏర్పాటు చేశారు. ఎవరైనా ఈ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ కోరారు. అక్రమ, అనధికారిక త్రవ్వకాలపై ఉక్కుపాదం మోపుతూ అటువంటి వాటిని నిరోధించేందుకు నిర్దేశించిన జరిమానాలకు సంబంధించి విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. నిషేధిత ప్రాంతాలైన భూగర్భజల నిర్మాణాలు, వంతెనలు, డ్యామ్‌లు, రైల్వే లైన్ల నుండి 500 మీటర్ల లోపల అక్రమ, అనధికార త్రవ్వకాలకు పాల్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అటువంటి చోట్ల పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత ఆర్డీవోలు, పోలీస్, సెబ్, మైనింగ్ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో పనిచేసి గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. చట్ట విరుద్ధమైన మైనింగ్, స్టాకింగ్, హోర్డింగ్, అమ్మకం, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాలకు వినియోగంచే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానాలను విధించాలని ఆదేశించారు. అయినా పట్టణంలో ఇసుక దోపిడీ బహిరంగంగానే సాగుతోంది.



పెన్నానదిలో ఇసుకను తోడుతున్న దృశ్యం



సెబ్ పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

నిఘా ఏర్పాటు చేస్తాం

అక్రమ ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్ అదేశించిన విధంగా గట్టి నిఘా ఏర్పాటు చేశాం. పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నుంచే ఇసుకను తీసుకు రావాలి. అలా కాకుండా నదీ పరివాహక ప్రాంతాలలో ఇసుకను తరలిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

శివప్రసాద్ రెడ్డి
తహశీల్దార్, హిందూపురం

రైతాంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కె.సంపత్‌కుమార్

ప్రజాశక్తి- అనంతపురం



బాధ్యతలు స్వీకరిస్తున్న సంపత్‌కుమార్

రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించనున్నట్లు విద్యుత్ శాఖ ఉమ్మడి అనంతపురం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.సంపత్‌కుమార్ తెలిపారు. జిల్లా నూతన సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా కె.సంపత్‌కుమార్ స్థానిక కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ)గా తిరుపతి కార్పొరేట్ ఆఫీస్‌లో పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. యావత్ సిబ్బందిని ఏకతాటిపై తీసుకొచ్చి విద్యుత్ శాఖ రెవెన్యూ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఉదయమే ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యోగులు విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా బాధ్యతల స్వీకరణ విషయంలో కాస్త గందరగోళం ఏర్పడిది. చివరకు ఆదివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పెద్దఎత్తున ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా ఆయన కదిరి ఏఈ, ఏడీఈగా సుమారు 17 ఏళ్లు జిల్లాలో పని చేశారు. తర్వాత గుంతకల్లు, హిందూపురం ఏడీఈగా పని చేశారు. ఆ తర్వాత అనంతపురం ఆపరేషన్స్, ట్రాన్స్ ఫార్మర్స్ డీఈగా పని చేసిన అనుభవం ఉంది. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డిప్యూటీ ఇఇలు శ్రీనివాసులు, వివేకానంద స్వామి, రామకృష్ణ, ఏఏఓ గంగన్న, ఫోర్మన్ గోపాల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి-హిందూపురం

సైన్స్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ప్లీనరీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ, మహేంద్ర రెడ్డి, డాక్టర్ ఈటి రామ్మూర్తి, పి. రామకృష్ణ, జిఆర్. సిద్ధు, హరి, సడ్డపల్లె చిదంబరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచి శాస్త్రీయ తృక్ఫథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్య మానవ మనుగడకు సైన్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. సైన్స్ లేనిదే మానవ మనుగడ లేదన్నారు. మనిషి దైనందిక జీవితంలో సైన్స్ ఒక భాగమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలపై ప్రచారం చేస్తూ అవగాహన కల్పించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తూ ఉందన్నారు.ఉత్తర ప్రదేశ్ లోని హద్రాస్‌లో భోలేబాబా పాద దూళి స్పర్శ కోసం వెళ్లిన భక్తుల్లో 121 మంది మృతిచెందడం బాధాకరమన్నారు. దీనికి ప్రధాన కారణం మూఢనమ్మకమేనన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలు ఇంకా ఇలాంటి మూఢనమ్మకాలపై విశ్వాసం చూపడం సరైనది కాదన్నారు. ప్రభుత్వాలు వీటిని దృష్టిలో ఉంచుకొని మూఢనమ్మకాలపై ప్రత్యేకమైన చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రోజురోజుకు ఎంతో అభివృద్ధి చెందుతున్న హిందూపురం ప్రాంతంలో ఐటీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాలు తగిన చొరవ చూపాలన్నారు. హిందూపురం వాణిజ్యంగా ఎంతో అభివద్ధి చెందుతుందని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులకు గురికాకుండా రింగ్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. హంద్రీనీవా జలాలను పూర్తిస్థాయిలో హిందూపురం ప్రాంతంలోని చెరువులకు నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని ప్లీనరీ సమావేశంలో తీర్మానాలు చేశారు. అదేవిధంగా లేపాక్షిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జెవివి ప్రతినిధులు మారుతీ శ్రీనివాస్, చైతన్య గంగిరెడ్డి, మురళీమోహన్, జిఆర్. శ్రీనివాసులు, టికె. లక్ష్మీపతి, ఎం. రామకృష్ణ, రవీంద్రారెడ్డి, అలీముల్లా, హనుమంతప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్. గేయానంద్

కార్మికుల సంక్షేమానికి పలు ప్రభుత్వ పథకాలు

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సి.సూర్యనారాయణ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి. సూర్యనారాయణ పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన లేని పలువురు కార్మికులు కేవలం తమ రెక్కల కష్టం పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసంఘటిత కార్మికులకు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్మిక చట్టాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అయితే గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లేని కార్మికులు ఆ ఫలాలను అందుకోలేకపోతున్నారన్నారు. అలాంటి వారు ప్రమాదవశాత్తు అంగవైకల్యంతో బాధపడేవారు కొందరైతే, మృతిచెందిన వారి కుటుంబాలు మరికొన్ని ఉన్నాయన్నారు. అలాంటి బాధితుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు వాటి అమలు తీరుపై జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.సూర్యనారాయణ ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : భవన నిర్మాణ, ఇతర పనులు చేసే కార్మికుల సంక్షేమం కోసం మీ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు ఏమిటి.?

జవాబు : అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత, ప్రమాద బీమా, అంగవైకల్యం పొందిన వారికి ఆర్థిక సహాయం, కార్మిక కుటుంబాలలోని ఇద్దరు కుమార్తెలకు పెళ్లి కానుక తదితర ప్రయోజనాలు పొందవచ్చు. అయితే కార్మిక శాఖలో గుర్తింపు పొందిన వారికి మాత్రమే ఈ ప్రయోజనాలు వర్తిస్తాయి. ప్రతి కార్మికుడు కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందాల్సి ఉంటుంది.

ప్ర : గుర్తింపు కార్డు పొందేందుకు ఏయేరంగంలోని కార్మికులు అర్హులు?



జ : వ్యవసాయ మరియు అనుబంధ ఉపాధుల్లో పనివారు, చిన్న సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవన పనివారు, నర్సరీలు, పాడి పరిశ్రమ, మత్స్యకారులు, భవన నిర్మాణ కార్మికులు వాటి అనుబంధ రంగాలలో పనిచేసేవారు, త్రవ్వకం, రాళ్ళ కొట్టే పని, సెంట్రింగ్, ప్లంబింగ్, శానిటరీ, పెయింటర్స్, టైల్స్ పనిచేసేవారు, ఎలక్ట్రీషన్, వెల్డింగ్, ఇటుక, సున్నం బట్టీలు, కాంక్రీట్ మిల్లర్, బావులు తవ్వడం, పూడిక తీయడం, టైలరింగ్‌లో పనిచేసేవారు. అలాగే ఆటోమొబైల్ రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు హెల్పర్లు, చేనేత, కమ్మరి స్వర్ణకారులు, కుమ్మరి, క్షౌరవత్తి, చర్మకారులు రజకులు, వీధి దీపాలు చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారాలు, కల్లుగీత కార్మికులు, పాచి పని చేసేవారు, ఎన్ఆర్ఈజీ వర్కర్లు మిడ్ డే మీల్స్ వర్కర్లు, ఆశాలు, వలస కార్మికులు వీరంతా గుర్తింపు కార్డులకు అర్హులు అవుతారు.

ప్ర : గుర్తింపు కార్డులు ఎక్కడ పొందాలో తెలపండి?

జ : 16 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు, ఆదాయపన్ను చెల్లించనివారు, ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ మరియు స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సదుపాయం లేని వారు ఈ గుర్తింపు కార్డు పొందవచ్చు. ఈ కెవైసి కలిగిన ఆధార్ అనుసంధానమైన ఫోన్ నెంబర్ ఇవ్వవలసి ఉంటుంది. వీరు సమీప గ్రామ వార్డు సచివాలయాలు, కామన్ సర్వీసెస్ సెంటర్ లో నమోదు చేయించుకోవచ్చు. నమోదుకు ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ప్ర : గుర్తింపు కార్డు పొందిన కార్మికులకు కలిగే ప్రయోజనాలు వివరించండి ?

జ : కార్మికుని ఇంటిలో ఇద్దరు కుమార్తెల వివాహానికి 20 వేలు చొప్పున మంజూరు, కార్మికుని భార్య లేదా కుమార్తెల ప్రసూతి ఖర్చులకోసం 20 వేలు సహాయం, కార్మికుడు లేదా కార్మికురాలు సాధారణ మరణం పొందితే రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ. 5 లక్షలు బీమా, అంగవైకల్యం చెందితే అంగవైకల్యం శాతం బట్టి బీమా సౌకర్యం ఉంటుంది. నైపుణ్యం పెంపొందించే శిక్షణలు కూడా ఇవ్వడం జరుగుతుంది. 15 రోజులపాటు ఇచ్చే ఈ శిక్షణలో రోజు స్టైయి ఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుంది. గుర్తింపు కార్డు పొందిన కార్మికులు ప్రతిఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది.

ప్ర : జిల్లాలో ఎక్కడెక్కడ మీ శాఖలు ఉన్నాయి? సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

జ : జిల్లాలో ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురంలో మా శాఖలు ఉన్నాయి. సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. సత్యసాయి జిల్లా కేంద్రంలో జిల్లా కార్యాలయం ఏర్పాటు చేయాల్సుంది. ప్రభుత్వం అందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్ర : ఇప్పటివరకు జిల్లాలో ఎంతమంది కార్మికులు నమోదు కాబడ్డారు? కార్మికులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?



అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సూర్యనారాయణ

జ: జిల్లాలో 36 వేల మంది కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేశాం. అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని, సహకారాన్ని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం. గుర్తింపు కార్డు నమోదు ఉచితంగా చేసుకోవచ్చు. ఇంకా నమోదు చేయించుకోని కార్మికులు వెంటనే తమ పేరు నమోదు చేసుకుని పథకాలు పొందాలని కోరుతున్నాం.

అనంతపురం-తాడిపత్రి మార్గంలో

'పల్లె వెలుగు' నడపాలి : సిపిఎం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అనంతపురం–తాడిపత్రి మార్గంలో పల్లెవెలుగు బస్సులను నడపాలని సిపిఎం నాయకులు ఆర్.కుళ్లాయప్ప, డి.శ్రీనివాసులు, వి.శివారెడ్డి, సి.నాగేంద్ర, సంజీవరెడ్డి, నెట్టికంటయ్య, బి.హరికృష్ణ, ఎం.వేణుగోపాల్, పుల్లయ్య, తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శింగనమల, తాడిపత్రి ఎమ్మెల్యేలు మారుతున్నారు తప్ప.. ఈ మార్గంలో గ్రామాల ప్రజల సౌకర్యార్థం పల్లెవెలుగు బస్సులను మాత్రం నడపలేకపోతున్నారన్నారు. పల్లె వెలుగు బస్సులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కువగా ఉండటంతో వాటిని ఎక్కి ప్రయాణికులు జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారన్నారు. అనంతపురం–తాడిపత్రి మార్గంలో దాదాపు 20 వరకూ గ్రామాలు ఉన్నాయన్నారు. వీరందరికీ పల్లె బస్సులు లేకపోవడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. తద్వారా సకాలంలో వ్యయ, ప్రయాసలతో ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. దీనికితోడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్తితి నెలకొందన్నారు. ఎందుకంటే ప్రయివేటు వాహనాలు అతివేగంగా వెళ్తుండటంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ధర్మవరం నుంచి తాడిపత్రి పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నారు. కానీ అనంతపురం నుంచి తాడిపత్రికి మాత్రం పల్లె వెలుగు బస్సులు నడపడం లేదన్నారు. ఇప్పటికైనా తాడిపత్రి, శింగనమల ఎమ్మెల్యేలు జెసి అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ స్పందించి ఉన్నతాధికారులతో చర్చించి అనంతపురం–తాడిపత్రి మార్గమధ్యంలో పల్లె వెలుగు బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాతిదూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం


నగదు బహుమతులు అందజేస్తున్న టిడిపి నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి

గురు పౌర్ణమిని పురస్కరించుకుని గార్లదిన్నె మండల కేంద్రంలో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి రూ.50వేలు, రెండో బహుమతి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి రూ.40వేలు, మూడవ బహుమతి మాజీ జడ్పిటిసి గాండ్ల విశాలాక్షి రూ.30వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌చౌదరి, గేట్ కృష్ణారెడ్డి, పాండు, అశోక్‌కుమార్, బాలకృష్ణ, ఇల్లూరు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, గుర్రం ఆదినారాయణ, చంద్రశేఖర్‌నాయుడు, రామాంజనేయులు, గుర్రం శ్రీనివాసులు, పెనకచర్ల నరసింహారెడ్డి, కల్లూరు రాము, బాబయ్య, గార్లదిన్నె మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

గురు పౌర్ణమి సందర్భంగా ఉరవకొండ పట్టణ నడిబొడ్డున ఉన్న కొండపై వెలసిన బడే సోమేశ్వరస్వామి గిరిప్రదక్షిణ ఆదివారం ప్రారంభమైంది. ఉరవకొండ కొండ చుట్టూ పలు ఆలయాలను సందర్శిస్తూ మూడు కిలోమీటర్ల మేర జరిగే ఈ గిరి ప్రదర్శనను భక్తులతో కలిసి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. సోమేశ్వర స్వామివారి గిరికి గిరిప్రదక్షిణా విధిని ఏర్పాటు చేయటంతో ఈ ఆలయానికి మరింత శోభ రానుంది. గిరిప్రదక్షిణలో భక్తుల సంకీర్తనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఈ గిరి ప్రదర్శనలో ప్రధానంగా పలు ప్రముఖ, పురాతన ఆలయాల సందర్శన పెట్టారు. ముందుగా మూగ బసన్నకట్ట, అనంతరం మార్కండేయ స్వామి, రామలింగ చౌడేశ్వరి ఆలయంలోని రామలింగేశ్వర స్వామి, నీలకంఠేశ్వర స్వామి, కన్యకాపరమేశ్వర ఆలయంలో పరమేశ్వర స్వామి, చిన్న కొండపై వెలసిన కాశీలింగేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, నగరేశ్వర స్వామి, వీరభద్రలింగేశ్వర స్వామి, సుబ్రమస్వామి ఆలయంలోని శివయ్య స్వామి, పాతపేటలో నంజుండేశ్వర స్వామిని, గవిసిద్దేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం శ్రీబడే సోమనాథేశ్వర స్వామి దర్శించుకున్న తర్వాత గిరి ప్రదర్శన పరిపూర్ణం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-పామిడి

గ్రామస్థాయి నుంచి సిపిఎంను బలోపేతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకూ ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను అధ్యయనం చేయాలన్నారు. అన్నివర్గాల ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూసేలా భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు నిర్వహించాలన్నారు. సిపిఎం కార్యకర్తలంతా సిపిఎంని బలోపేతం చేసేందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, ముత్యాలు, ఈశ్వరయ్య, శ్రీరాములు, సత్తార్‌బాషా, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ చికిత్స శిబిరం


మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ సుధాకర్ రైతులతో మాట్లాడుతూ 90శాతం ఖచ్చితత్వంతో పేయిదూడల పుట్టుక కోసం లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పశువుల్లో చూడి నిర్ధారణ, తిరిగి ఎదకు వస్తూ కట్టకుండా నిలిచిపోయినవి, పూర్తిగా ఎదకు రానివి వంటి 45 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. తర్వాత 47 పశువులకు నట్టల నివారణ మందులు తాపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

పామిడి : పట్టణంలోని టిసి ప్రభుత్వ పాఠశాలలో 1988–89లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయంలో స్థిరపడిన ఆనాటి పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. వారు చేస్తున్న వృత్తి, ఉద్యోగాలు తెలుసుకుని, వారికి పాఠాలు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి పనులకు తమవంతు సహాయ, సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొమ్మ మోహన్, బొల్లు వెంకట్రామిరెడ్డి, రుక్మాన్, పాపిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, శర్మాస్, రమేష్, రామాంజి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు..

వైఎస్ఆర్ విగ్రహానికి టిడిపి, జనసేన నేతల వినతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం


రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి, జనసేన నేతలు

'వైఎస్.రాజశేఖర్‌రెడ్డి.. నీ కొడుకు జగన్‌మోహన్‌రెడ్డికి నీవైనా మంచి బుద్ధి ప్రసాదించు..' అని టిడిపి, జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అసెంబ్లీకి వచ్చేవిధంగా, త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే విధంగా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. అంతేగాకుండా అసెంబ్లీతోపాటు సమాజంలో హుందాగా ప్రవర్తించేందుకు ఆత్మరూపంలో వచ్చి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ మీడియా ఇన్‌ఛార్జి రాయుడు, టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు నీలాస్వామి, మండల టిడిపి, జనసేన నాయకులు పరమేష్, శివప్ప, బజ్జన్నగౌడు, శివకుమార్, పక్కీరప్ప, శివలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చు

ప్రజాశక్తి-అనంతపురం


రక్తదానం చేస్తున్న బిసాటి భరత్, యువత

యువత ప్రతి మూడునెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని జిల్లా రిజిస్ట్రార్ జి.భార్గవ్ సూచించారు. ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మారవచ్చన్నారు. రక్తదానం చేయడంతోపాటు ప్రతి ఒక్కరిలో రక్తదానంపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ సాకే గోపీనాథ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మనం ముగ్గురు నిండు ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అలాగే వర్షాకాలంలో డెంగీ జ్వరాలు వ్యాపిస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ రక్తదానికి ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువతకు కేంద్ర ప్రభుత్వం, రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం ద్వారా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ మై గవర్నమెంట్ అంబాసిడర్ బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, రైపర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగశుభ, ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ మురళీకృష్ణ, అరుణ్ ఐస్‌క్రీమ్ డిస్ట్రిబ్యూటర్ రాఘవేంద్రయాదవ్, ఫణిరాజ్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు వై.పవన్, రైపర్ కళాశాల ఎన్ఎస్ఎస్ స్టూడెంట్ కోఆర్డినేటర్ కిరణ్‌సాయి, జి.నందిత, ఫనీశ్వర్ , గణేష్, శివ, యువతీ, యువకులు పాల్గొన్నారు.

మానవాళికి 'వాల్మీకి' దిశానిర్దేశం

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థినులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పోతుల నాగరాజు

మానవాళికి వాల్మీకి మహర్షి దిశానిర్దేశం చేశారని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక వాల్మీకి భవనంలో ఆదివారం వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి (బోయ) వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూధర్మంలో వివాహానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. వాల్మీకి మహర్షి రామాయణం ద్వారా మంచి వివాహ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. వాల్మీకి పిల్లల వివాహాలకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాలకు మేము సైతం అంటూ వాల్మీకి ఉద్యోగుల సంఘం అండగా నిలిచిన తీరు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, నరహరి, వెంకటేష్, విశ్రాంత డిఎఫ్ఓ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు..

స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కళ్యాణ మండపంలో మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా బోయ గిరిజమ్మ మాట్లాడుతూ గత 20ఏళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా 35 మంది విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ నాగరాజు, డాక్టర్ మహేష్, మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

ప్రజాశక్తి-గుత్తి


కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

మండల పరిధిలోని రజాపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు పరిరక్షించాలని సర్పంచి విజయలక్ష్మి, గ్రామస్తులు కేశవులు, సీతారాముడు, మదన కామరాజు, మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెనుక సర్వే నెంబర్–06లో సుమారు 19ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు. సంబంధిత సర్వే నంబర్‌లో సుమారు 72 ఎకరాల భూమిని బ్రిటీష్ హయాంలో పశువుల మేత, పచ్చిక బయలు కోసం వదిలేశారన్నారు. ఇందులో పదెకరాల అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు కేటాయించారు. 62 ఎకరాల భూమి మిగిలింది. అప్పటి నుంచి గ్రామస్తుల సహకారంలో భూమి కబ్జాకు గురికాకుండా కాపాడుకుంటూ వచ్చామన్నారు. అయితే ఇటీవల కొందరు తమకు19 ఎకరాల భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం ఉందని, జేసీబీలతో భూమిని చదును చేశారన్నారు. గ్రామ శివారులో ఉన్న భూములలో చిన్నపాటి వర్షాలకే భారీగా గడ్డిమొలచి తమ గ్రామంలోని పశువుల మేతకు ఇబ్బంది లేకుండా ఉండేదని తెలిపారు. అలాంటి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుంటే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. భూములు కబ్జాలు చేస్తూ పోతే భవిష్యత్తులో తమ పశువులకు గడ్డి దొరకక పశు సంపద అమ్మేసుకునే పరిస్థితి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. వెంటనే రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేయాలన్నారు. అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసి ఉంటే వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో కలెక్టర్, సిఎస్, ముఖ్యమంత్రికు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



పుట్లూరు : మండల పరిధిలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాగిరెడ్డిపల్లి, సూరేపల్లిలో వెలసిన బాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలుతోపాటు అన్నదానం చేశారు.

నార్పల : మండల కేంద్రంలోని చింతవనం కొట్టాలలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి బాబాకు ప్రత్యేక హారతులు, అభిషేకాలు, పూజలు చేశారు.

శింగనమల : మండల కేంద్రంలోని చెరువుకట్టపై వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి షిరిడీసాయి మందిరంలో బాబాకు ప్రత్యేక హారతులు, అభిషేకాలు, పూజ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు. తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా షిరిడీ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆలయ ఆవరణలో హోమాలు చేశారు. తర్వాత చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జయంతి రాధాకృష్ణ, శ్రీనివాసులు, బండి కిష్టప్ప, రామాంజనేయులు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : ఉరవకొండలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తర్వాత సాయిబాబా మూలవిరాట్‌ను వివిద రకాలపూలతో అందంగా అలంకరించారు. అలాగే గురు దత్తాత్రేయ స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఉట్లతేరు

ప్రజాశక్తి-పామిడి


ఉట్ల తేరులో పాల్గొన్న భక్తులు, ప్రజలు

రుక్మిణి సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రంగసుభే భావసర ఫిర్కా ఆధ్వర్యంలో ఆదివారం ఉట్లతేరును కన్నుల పండవగా సాగింది. తేరును ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఇఒ ఎ.క్రిష్టయ్య, సంఘం అధ్యక్షులు టిటి.నాగభూషణరావు ప్రారంభించారు. చక్క భజనలు, దిండి భజనలు, సన్నాయి వాయిధ్యాల మధ్య తేరు సాగింది. తొలుత థాయింది మృత్తిక పాత్రను గర్భాలయం పూజలు చేసి ఊరేగించారు. ఉట్లమానుకు ఆ పత్రను బిగించి దైవ కర్రలతో పగులగొట్టారు. అనంతరం గ్రామోత్సవం చేశారు. భక్తులు కొబ్బరికాయలు, ఫల పుష్ప తాంబూలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


సంక్షేమ కార్యక్రమాలను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

పోలీసు సంక్షేమ కార్యక్రమాల అమలు పరిశీలన

అనంతపురం క్రైం : జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఎస్పీ కెవి మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్ కన్వెన్సన్ హాల్, పోలీస్ కాంప్లెక్స్, పోలీస్ పెట్రోల్ బంకు, వాటర్‌ప్లాంటు, డాగ్‌స్క్వాడ్, జిమ్, ఇండోర్ స్టేడియం, సిపిసి క్యాంటీన్, రామాలయం, షాదీఖానా, ఈసర్వెలెన్స్ సెంటర్ , పిసిఆర్, సైబర్ సెల్ , డయల్–100ను సందర్శించారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో మాట్లాడి కార్యక్రమాలు అమలవుతున్న తీరుపై ఆరాతీశారు. సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎ.ఆర్ డీఎస్పీ మునిరాజ, ఆర్ఐలు రాముడు, మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధిలో 'ఫోర్టో'ను భాగస్వామ్యం చేయాలి

అనంతపురం క్రైం : విద్యారంగం అభివృద్ధి, అభ్యున్నతిలో ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్)ను భాగస్వామ్యం చేయాలని ఛైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య, ముఖ్య సలహాదారులు గాండ్లపర్తి శివానందరెడ్డి, మీడియా కన్వీనర్ గరికపాటి సురేష్, అధికార ప్రతినిధులు బోనెల రమేష్, మాగంటి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఫోర్టోలో 16 రిజిస్టర్ ఉపాధ్యాయ సంఘాలు సభ్య సంఘాలుగా ఉన్నాయన్నాయన్నారు. సమస్యలు లేని విద్యారంగాన్ని ఫోర్టో అభిలషిస్తోందన్నారు. విద్యారంగం అభివృద్ధిలో సంపూర్ణ భాగస్వామ్యం కావాలని కోరుకొంటోందన్నారు.

'ఉపాధి' కోర్సులకు శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు నార్పల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ ఫెయిల్, పాసైన విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు ఆల్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వాల్మీకి సంఘం జిల్లా కార్యదర్శిగా కృష్ణయ్య



గుత్తి : ఎపి వాల్మీకి (బోయ) సంఘం అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పిల్లెల్లి కృష్ణయ్య ఎన్నికయ్యారు. ఈమేరకు స్థానిక పట్టణానికి చెందిన పిల్లెల్లి క్రిష్ణయ్యకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు క్రాంతినాయుడు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్రిష్ణయ్య మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరారు. ఎస్టీ సాధన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

25 నుంచి కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు

గుత్తి : మండల పరిధిలోని పూలకుంట గ్రామంలో చిన్నపీర్ల పండుగను పురస్కరించుకుని ఈనెల 25వతేదీ నుంచి కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. 25న చిన్న సరిగెత్తు, 26న విడిదినం, 27న పెద్ద సరిగెత్తు, 28న జలధి కార్యక్రమం ఉంటుందన్నారు. 27న పెద్దసరిగెత్తు సందర్భంగా అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా భీమలింగేశ్వర స్వామి బిందెసేవ

వజ్రకరూరు : విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేములవాడ భీమలింగేశ్వరస్వామి మహారథోత్సవంలో భాగంగా ఆదివారం బిందెసేవను ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం హాంచనహల్ నుంచి అడ్డపల్లికి సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బిందెసేవ పూజలో భాగంగా ఆలయ అర్చకులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఊరుబావి నుంచి మేళతాళాల మధ్య పవిత్ర జలంతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం బిందెసేవతోపాటు భీమలింగేశ్వర స్వామి, సంజమ్మ అవ్వ మూల విరాట్లను పల్లకిలో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం మహామంగళహారతి వంటి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.


బిందెసేవలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

నేరాలు ఘోరాలు

కారు-లారీ ఢీ..వ్యక్తి మృతి


మృతిచెందిన నీలకంఠ ఆచారి

పుట్లూరు : మండలం పరిధిలోని ఎ.కొండాపురం గ్రామ శివారులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో కార్లులో ప్రమాణిస్తున్న వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తాడిపత్రికి చెందిన నీలకంఠ ఆచారి (46) అనంతపురం నుంచి తాడిపత్రికి వస్తుండగా ఎ.కొండాపురం సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో నీలకంఠ ఆచారి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా నీలకంఠ ఆచారి గత ఎన్నికల్లో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా తాడిపత్రి నుంచి పోటీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బసినేపల్లి గ్రామానికి చెందిన సునీల్ ద్విచక్రవాహనంలో గ్రామంలోని ఇంటికి వెళ్తుండగా గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ సునీల్ ను కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.